## 154. శపించక

హైద్రాబాద్ నించి తన ఆశ్రమానికి వచ్చిన ఓ భక్తుడు కొద్దిగా ముభావంగా ఉండటం గమనించిన గురువు కారణం అడిగితే చెప్పాడతను.

"మా తాత మొదలెట్టిన పచారీ దుకాణాన్నే నేను నడుపుతున్నాను. డబ్భై అయిదేళ్ళయింది అది స్థాపించి. మాకు ఎదురుగా ఓ జాతీయ చెయిన్ స్టోర్ తెరిచారు. దాంతో నా వ్యాపారం దెబ్బ తింటోంది."

గురువు వెంటనే చెప్పాడు.

"నువ్వు ఆ కొత్త స్టోర్‌ని శపించక. ద్వేషం ఎప్పుడూ మంచిది కాదు. ప్రతీ రోజు నీ దుకాణం తెరిచాక అది అభివృద్ధి చెందాలని ప్రార్థించు. అలాగే నీ దుకాణం ఎదురుగా వున్న చెయిన్ స్టోర్ కూడా అభివృద్ధి చెందాలని ప్రార్థించు."

" అదేమిటి? నన్ను సర్వ నాశనం చేసే ఆ స్టోర్ కూడా అభివృద్ధి చెందాలని ప్రార్థించాలా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"నీకు ఆ దుకాణం మీద కలిగే ఏ చెడ్డ ఆలోచనైనా సరే వెనక్కి తిరిగి నీకే వస్తుంది. అలాగే మంచి ఆలోచన కూడా." హెచ్చరించాడు గురువు.

ఆర్నెల్ల తర్వాత ఆ వ్యాపారస్థుడు గురువు దగ్గరకి వచ్చి చెప్పాడు.

"స్వామీ. మీరు చెప్పింది నిజమే. నా దుకాణాన్ని నేను మూసేసాను. కాని ఆ దుకాణం యజమానినైన నేను అభివృద్ధి చెందాను. నా దుకాణం ఎదురుగా తెరచిన చెయిన్ స్టోర్‌కి నన్ను మేనేజర్‌గా నియమించారు. నా దుకాణం మీద వచ్చే ఆదాయం కన్నా ఆ జీతం ఎక్కువ."

## 155. బోధ

దేవుడి కోసం వెదికే ఓ ముముక్షువు ఓ సద్గురువుని కలిసి వినయంగా కోరాడు.

"స్వామీ! నన్ను మీ శిష్యుడిగా స్వీకరించి దైవాన్ని కనుగొనే మార్గం నాకు బోధించండి."

అతని వంక పరిశీలనగా చూసి చెప్పాడు ఆ బ్రహ్మజ్ఞాని.

"నువ్వే అది. దేవుడు నీలోనే ఉన్నాడు. అక్కడ వెదుకు."

"ఇది నాకు ఇదివరకే తెలుసు. ఇంకేదైనా బోధించండి."

"నాకు తెలిసిన బోధ ఇదొక్కటే. నీకు ఇంకో బోధ కావాలంటే నువ్వు ఇంకో గురువుని ఆశ్రయించు." చెప్పాడు బ్రహ్మజ్ఞాని.

## 156. నిజమైన సాధువు

తీర్థ యాత్రలకి వెళ్ళే ఓ సాధువు మునిమాపు వేళ ఓ గ్రామానికి చేరుకున్నాడు. ఆ గ్రామం మొదట్లోనే ఓ వేశ్య ఇల్లుంది. ఆయన్ని గమనించి, ఆయన దగ్గర బాగా డబ్బుండచ్చని భావించి, భక్తి నటిస్తూ తన ఇంటికి ఆహ్వానించింది. ఆయన ఆ ఆహ్వానాన్ని మన్నించి ఆమె ఇంటికి వెళ్ళాడు.

"ఆమె వేశ్య అని మీకు తెలీదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించారు గ్రామస్థులు మర్నాడు ఆ ఇంట్లోంచి వస్తున్న అతన్ని చూసి.

"తెలుసు. కాని నాకు అక్కడ చాలా సౌకర్యంగా ఉంది." జవాబు చెప్పాడు సాధువు.

ఆ గ్రామంలో ఉన్నంత కాలం ఆ సాధువు ఆమె ఇంట్లోనే బస చేయడమే కాక, అసలు ఇంట్లోంచి బయటికే రావడం మానేసాడు. ఈ విడ్డూరానికి గ్రామస్థులంతా చెవులు కొరుక్కున్నారు.

మూడు రోజుల తర్వాత ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. ఆ సాధువు తన తీర్థయాత్రని కొనసాగించాడు. ఆ నాటినించీ ఆ వేశ్య తన వృత్తిని మానేసి, భగవద్భక్తితో కాలం గడపసాగింది. ఆయన మూడు రోజులు లోపల ఉండి ఏం చేసాడో అప్పటికి కాని గ్రామస్థులకి అర్థం కాలేదు.